క్లుప్తంగా

రగులుతున్న కూటమి నేతలు

రామచంద్రపురం: నీటి సంఘాల ఎన్నికలు వేదికగా కాజులూరు మండలం కూటమి నేతలలో విభేదాలు గుప్పుమన్నాయి. మండల డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ ఎంపికలో తాము సిఫారసు చేసిన వ్యక్తికే ఇవ్వాలని టీడీపీ పట్టుబట్టగా తమ పార్టీకి చెందిన యువనేతలకు ఆ పదవి ఇవ్వాలని జనసేన నేతలు పట్టుబట్టి చివరకు పంతం నెగ్గించుకున్నారు. మండలంలో ఎనిమిది నీటి సంఘాలు ఉన్నాయి. ఈ నెల 14న నీటి సంఘాల అధ్యక్ష ఎన్నికలు జరగ్గా అధికార పార్టీ నాయకులు తమ అధికార బలంతో అన్ని సంఘాలను తమకు అనుకూలంగా ఏకగ్రీవం చేసుకున్నారు. అయితే టీడీపీకి చెందిన తాడి మాచారెడ్డి (రామారెడ్డి) గంపెడంత ఆశలతో మండలంలోని నీటి సంఘాలకు చెందిన వారిని తన పలుకుబడితో ఏకగ్రీవంగా ఎన్నికల్లో నెగ్గించుకున్నారు. కేవలం తనకు డీసీ చైర్మన్ పదవి దక్కుతుందననే ఆశతో ఆర్థికంగా కూడా ఎంతో ఖర్చు చేసినట్లు టీడీపీ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. కానీ చివరకు టీడీపీకి కాదని జనసేన నేతకు సామాజిక సమీకరణల్లో భాగంగా ఇవ్వడంతో ఆయన మండిపడుతున్నట్లు అదే పార్టీ నేతలు గుసగుసలాడుతున్నారు. ముందు నుంచీ జనసేన పార్టీలో ఉంటూ ఆ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న దుగ్గుదుర్రు నీటి సంఘం అధ్యక్షుడు లకాని కృష్ణచైతన్యకు డీసీ పదవి ఇవ్వాలని జనసేన నేతలు పట్టుబట్టారు. దీంతో ఈ విషయం పార్టీ చీఫ్ పవన్ వద్దకు చేరింది. ఈ మేరకు స్థానిక జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సిఫారసు మేరకు కృష్ణ చైతన్యకు డీసీ పదవిని అప్పగించారు. గత మూడు రోజుల పాటు చాపకింద నీరులా హోరాహోరీగా ఇరు పార్టీల మధ్య పోరు సాగింది. చివరకూ టీడీపీ నేత మాచారెడ్డి అలియాస్ రామారెడ్డిని కాదని కృష్ణచైతన్యకు పదవి ఇవ్వడంతో కూటమి నేతల విభేదాలు బయట పడ్డాయి. కాగా మంత్రి సుభాష్ నుంచి ఈ అంశంపై ఎటువంటి స్పందన లేకపోవటంతో టీడీపీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పకడ్బందీగా సమ్మేటివ్ పరీక్షల నిర్వహణ

కె.గంగవరం: ప్రస్తుతం పాఠశాలల్లో జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షలను మరింత పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు చేపట్టినట్లు సమగ్ర శిక్ష జిల్లా సీఎంఓ ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. మండల కేంద్రం కె.గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న సైన్స్ పరీక్షను ఆయన మంగళవారం పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. పాఠశాలలో ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు.

ఘనంగా స్త్రీల క్రిస్మస్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేట ప్లెంటీ టు షేర్ మినిస్ట్రీస్ చర్చి ఆవరణలో రెవరెండ్ జి.గ్రేస్ విక్టోరియా ఆధ్వర్యంలో శనివారం స్త్రీల క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రామచంద్రపురం మండల ఎంపీపీ అంబటి భవాని, రామచంద్రపురం సెంటినరీ యేసు ప్రేమాలయం స్త్రీల ప్రెసిడెంట్ ఎం.లలితా నవమణి, ప్రభుత్వ ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ సారా విక్టోరియా ఈ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం కొవ్వొత్తులతో ఆరాధన నిర్వహించారు. పాటలు పాడి క్రీస్తును ఆరాధించారు. ప్రేమ విందును స్వీకరించారు. కార్యక్రమంలో వేగాయమ్మపేట, తోటపేట, గాంధీనగర్, కొత్తకోట గ్రామాల నుంచి 300 మంది మహిళా భక్తులు పాల్గొన్నారు.

మండపేటలో 19న జాబ్‌మేళా

మండపేట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండపేటలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు మండపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు వెల్లడించారు. డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం ఆయన మీడియ సమావేశంలో ఏర్పాటుచేశారు. రెండు కంపెనీల ద్వారా సుమారు 70 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేటలో వేంచేసిన కనకదుర్గా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుస్థిరాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి

కపిలేశ్వరపురం: సుస్థిరాభివృద్ధికి ప్రభుత్వ శాఖాధికారులు, సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాలపై ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని రీసోర్స్ పర్సన్‌లు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎల్ఏసీడీజీ సుస్థిరమైన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనకై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మండలంలోని 19 పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లకు శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి పర్యవేక్షణలో కార్యాలయ ఏఓ రాజేంద్ర ప్రసాద్, ఈఓ పీఆర్‌డీ మోహన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

రాయవరం: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా పంచాయతీలు కృషి చేయాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో మంగళవారం ఎంపీడీవో కీర్తి స్పందన ఆధ్వర్యంలో రెండు రోజుల ట్రెనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ తొమ్మిది థీమ్స్, 17 లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ ప్రణాళికలు ఏ విధంగా రూపొందించాలనే అనే అంశంపై రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో కీర్తి స్పందన తెలిపారు.

విద్యుత్ పొదుపు.. భవితకు వెలుగు

- రోజురోజుకూ అధికమవుతున్న వాడకం
- విద్యుత్తు పొదుపుపై అవగాహన కార్యక్రమాలు
- ఈ నెల 20 వరకూ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు


విద్యుత్తు సబ్ స్టేషన్

రాయవరం: కరెంటు లేకుండా పది నిమిషాలు కూడా ఉండలేం. అది ఇల్లయినా, ప్రభుత్వ కార్యాలయమైనా, పరిశ్రమ అయినా ప్రతి పని విద్యుత్‌తో ముడి పడి ఉంటుంది. విద్యుత్ వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. రోజురోజుకూ విద్యుత్తు అవసరాలు పెరుగుతున్నాయి. ఫలితంగా బిల్లులు అధికంగా రావడమే కాకుండా పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనిని కట్టడి చేసేందుకు వృథాను అరికట్టి విద్యుత్‌ను పొదుపుగా వాడాల్సిన అవసరం ఉంది. విద్యుత్తు పొదుపుపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ఏపీఈపీడీసీఎల్ ఏటా అవగాహనా వారోత్సవాలను నిర్వహిస్తుంది. శనివారం ప్రారంభమైన జాతీయ ఇంధన పొదుపు అవగాహన వారోత్సవాలను రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లోని ఏపీఈపీడీసీఎల్ అధికారులు నిర్వహిస్తున్నారు.

నియంత్రణకు చర్యలు

రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ పేరిట జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. 'విద్యుత్తు వృథా క్షమించరాని నేరం', 'విద్యుత్తు పొదుపు ప్రగతికి మలుపు', 'సహజ వనరులను కాపాడుకుందాం..భావితరాలకు భరోసా కల్పిద్దాం', 'విద్యుత్తు పొదుపు..భవితకు మలుపు' తదితర నినాదాలతో పలు మార్గాల్లో ప్రదర్శనలిస్తూ వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ చర్యలు తీసుకోనుంది. పొదుపు చేయడం కూడా విద్యుత్తును ఉత్పత్తి చేయడంగా చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో ఇంధన పొదుపు, పేద,మధ్య తరగతి కుటుంబాలకు అత్యవసరం. సాధారణ బల్బులు స్థానంలో ఎల్ఈడీల వినియోగంతో సుమారు 60 శాతం విద్యుత్తు ఆదా చేయవచ్చంటూ అధికారులు ప్రచారం చేస్తున్నారు. అవగాహనలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటుగా, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పరిధిలో కేటగిరి-1 గృహ సంబంధ, కేటగిరి-2 వాణిజ్యం, కేటగిరి-3 పరిశ్రమలు, కేటగిరి-4 వీధిలైట్లు, మసీదులు, పంచాయతీ వాటర్ వర్క్స్, దేవాలయాలు, కేటగిరి-5 ఆక్వా, వ్యవసాయ కనక్షన్లుగా పేర్కొంటారు.

వారం రోజుల పాటు

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 20 వరకు వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నారు. సబ్‌స్టేషన్లు, విద్యా సంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించడంతో పాటుగా, రైతులు, వినియోగదారులు, పారిశ్రామికవేత్తలకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు.

పక్కాగా మీటర్ కౌంటింగ్

విద్యుత్ శాఖ ప్రవేశ పెట్టిన ఎలక్ట్రానిక్స్ డిజిటల్ మీటర్స్ అతి చిన్న ఎల్ఈడీ లైటును వినియోగించినా లెక్కిస్తాయి. గతంలో ఉన్న మెకానికల్ మీటర్లు తొలగించి వాటి స్థానంలో ఎలక్ట్రానిక్స్ డిజిటల్ మీటర్స్ ఏర్పాటు చేశారు. రిమోట్‌తో టీవీ ఆఫ్ చేసినా, చార్జర్లకు ఉన్న ఎల్ఈడీ లైట్ల విద్యుత్ వాడకాన్ని కూడా అవి పరిగణలోకి తీసుకుంటాయి.

బిల్లు ఆదాకు మార్గాలు

- ఇళ్లలో సాధారణంగా ఫిల్మెంట్ బల్బును వాడరాదు. సీఎల్ఎఫ్, ఎల్ఈడీ బల్బులు వాడాలి.
- సీఎల్ఎఫ్, ఎల్ఈడీ బల్బుల వాడకంతో విద్యుత్ ఆదా, అధికంగా వెలుతురు, ఎక్కువ కాలం మన్నికనిస్తాయి.
- మూడు వాట్ల ఎల్ఈడీ బల్బు వెలుతురు 45 వాట్ల ఫిల్మెంట్ బల్బుతో సమానంగా వెలుతురునిస్తుంది.
- ఏసీ, టీవీ ఉపయోగించిన తర్వాత బోర్డువద్ద స్విచ్చాఫ్ చేయాలి. లేకుంటే ఎల్ఈడీ లైటు ఆన్‌లో ఉన్న కారణంగా డిజిటల్ మీటర్ యూనిట్లు కౌంట్ చేస్తూనే ఉంటుంది.
- ఐఎస్ఐ మార్కు ఉన్న గృహోపకరణాలు వాడాలి. ఐఎస్ఐ మార్క్ మోటార్లు ఉపయోగిస్తే 20శాతం పైగా విద్యుత్ ఆదా అవుతుంది.
- సెల్‌ఫోన్ చార్జింగ్ పూర్తయిన వెంటనే స్విచ్ కట్టాలి.
- ఎలక్ట్రికల్ స్టవ్, కుక్కర్‌కి బదులు గ్యాస్ స్టౌ వినియోగించాలి.
- ఆటోమేటిక్ ఇస్త్రీ పెట్టె, మిక్సీ, వాషింగ్ మెషీన్ వినియోగాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలి.
- విద్యుత్తు హీటర్లు, గీజర్లు బదులుగా సోలార్ పరికరాలు ఉపయోగించాలి.
- కంప్యూటర్లకు ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలి.
- కంప్యూటర్లు షట్ డౌన్ చేశాక స్విచ్ ఆఫ్ చేయాలి.
- మిక్సీ, కూలర్, వాషింగ్ మెషీన్, ఏసీ, షోకాజ్ ఐటమ్స్, ఇస్త్రీ పెట్టె, హోమ్ థియేటర్, టీవీ, సౌండ్ సిస్టమ్, దోమల మెషీన్లు అవసరం లేకపోతే స్విచ్ ఆఫ్ చేయాలి.

పరోక్షంగా ఉత్పత్తి చేసినట్లే



విద్యుత్తును పొదుపుగా వినియోగించడం, ఆదా చేయడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్యుత్తు సరఫరాలో అంతరాయం తగ్గించగలిగాం. విద్యుత్తును పొదుపుగా వాడడం, ఆదా చేయడంపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు కూడా విద్యుత్తును పొదుపుగా వాడుకుంటే, పరోక్షంగా ఉత్పత్తి చేసినట్టే.

– ఎస్.శ్రీనివాసులు, ఏఈ, ఏపీఈపీడీసీఎల్, సబ్‌స్టేషన్, రాయవరం

విద్యుత్తు ఆదాపై అవగాహన



విద్యుత్‌ను పొదుపుగా వాడుకుని, భావితరాలకు ఆదా చేయాలి. సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ప్రాధాన్యతనివ్వాలి. ప్రతి వినియోగదారుడు ఉత్పత్తిదారుడుగా మారాలి. సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. విద్యుత్తు పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్తు పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించేందుకు డివిజన్ పరిధిలో ఏర్పాట్లు చేశాం. విద్యుత్తు పొదుపు వల్ల కలిగే లాభాలను వివరిస్తూ కరపత్రాలను కూడా పంపిణీ చేస్తున్నాం. వినియోగదారులు కూడా సహకరించాలి.

– కె.రత్నాలరావు, ఈఈ (ఆపరేషన్), ఏపీఈపీడీసీఎల్, రామచంద్రపురం

షాపుల సబ్ లీజు ఆమోదయోగ్యమేనా?

- ప్రశ్నించిన మున్సిపల్ కో -ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ
- అలాంటి వారి షాపులు స్వాధీనం చేసుకుంటామని కమిషనర్ వివరణ
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: వేలంలో మున్సిపల్ షాపులను పాడుకున్న పాటదారులు ఇతరులకు లీజుకు ఇస్తున్నారని, నిబంధనల ప్రకారం ఇది ఆమోద యోగ్యమేనా అని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ అధికారులను ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం పాడుకున్న వారు మాత్రమే అందులో కార్యకలాపాలు సాగించాలని కమిషనర్ టీవీ రంగారావు వివరణ ఇచ్చారు. షాపులను లీజుకు ఇవ్వడం చట్టరీత్యా నేరమని ప్రకటించారు. అలాంటివి తమ దృష్టికి వస్తే పాటదారుల షాపుల లీజును రద్దుచేసి వేరొకరికి ఇచ్చే హక్కు మున్సిపాలిటీకి ఉంటుందని స్పష్టం చేశారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, రిక్విజిషన్ సమావేశాలు కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశం మందిరంలో మంగళవారం జరిగాయి. చైర్ పర్సన్ దుర్గారాణి సమావేశానికి అధ్యక్షత వహించగా, ఎక్స్ అఫీషియో సభ్యుని హోదాలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమావేశానికి హాజరయ్యారు. పలు అంశాలపై కౌన్సిల్లో వాడీవేడిగా చర్చ జరిగింది.

రోడ్డు మార్జిన్లు కుంగిపోయాయి


కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడిద విద్యార్థుల సౌకర్యార్థం టాయిలెట్లు నిర్మిస్తే బాగుంటుందని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. 30వ వార్డు కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సత్యశ్రీ రోడ్డు నుంచి బైపాస్ రోడ్డు వరకూ ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లు కుంగిపోయాయన్నారు. దీనివల్ల సంఘం కాలనీ నుంచి వచ్చే విద్యార్థులు, సైక్లిస్టులు కుంగిన రోడ్డు మార్జిన్‌లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే బెర్ములు పూడ్చాలని కోరారు. తొలుత ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తన ప్రసంగంలో మాస్టర్ ప్లాన్ విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్‌ను అడ్డం పెట్టుకుని రైతుల నుంచి భూములు తక్కువ ధరకు లాక్కున్నారని ఆరోపించారు. లైసెన్సుడు సర్వేయర్‌తో 90 రోజుల్లోగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు, చేర్పులు చేసి ప్రజలందరికీ ఆమోద యోగ్యంగా ఉండేలా సమీక్ష జరుపుదామన్నారు. షాదీఖానాను గ్రౌండ్ ఫ్లోర్ పార్కింగ్ గాను, పైఅంతస్తు రూ 1.50 కోట్లతో అభివృద్ధి చేయాలని అనుకుంటున్నట్టు తెలిపారు. ఈ నెల 25న క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించుకుందామన్నారు. అలాగే అక్కడ కొన్ని ఆక్రమణల ఉన్నాయని, వాటన్నింటినీ ప్రారంభోత్సవం లోగా తొలగించాలని కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్ చుండ్రు చిన సుబ్బారావు చౌదరి మాట్లాడుతూ గత కౌన్సిల్‌లో మున్సిపల్ షాపుల అద్దె బకాయిలు ఎంత వున్నాయని ప్రశ్నిస్తే రూ. 52 లక్షలు అని చెప్పారని, అయితే ఆ తరువాత అది రూ. నాలుగు కోట్లుగా తేలిందన్నారు. దీనిపై తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే తానే దీనిపై ప్రైవేట్ కేసు వేస్తానని హెచ్చరించారు. తొలుత అంచనాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే వేగుళ్లను కౌన్సిల్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

మాజీ మంత్రి వేణుకు సత్కారం


మాజీ మంత్రి వేణును సత్కరిస్తున్న న్యాయవాదులు

రామచంద్రపురం: రామచంద్రపురానికి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు బెంచ్ ఏర్పాటు చిరకాల కోరికను నెరవేర్చటం చరిత్రలో సువర్ణాధ్యాయమని, ఎన్నో ఏళ్లుగా కక్షిదారులు, న్యాయవాదుల పోరాటం ఫలించిందని, దీనికి కారణ భూతులైన మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అభినందనీయులని న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు బెంచ్ ఏర్పాటుకు ఎంతో కృషి చేసిన మాజీ మంత్రి వేణును కోర్టు బెంచ్ ప్రారంభమైన సందర్భంగా న్యాయవాదులు ఆయన స్వగృహానికి వెళ్లి కృతజ్ఞతలు తెలియజేశారు. వేణును దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పిల్లి మురళీ, వాడ్రేవు సాయిప్రసాద్, ఇతర న్యాయవాదులు మాట్లాడుతూ జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటుకు గతంలో ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయన్నారు. వీటన్నింటినీ అధిగమించి అప్పటి ప్రభుత్వంలో ప్రభుత్వం తరఫున అప్పుడు మంత్రిగా ఉన్న వేణు చేసిన కృషి అభినందనీయమన్నారు. జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటు మూలంగా అటు కక్షిదారులతో పాటుగా రాబోయే యువ న్యాయవాదులకు ఎంతో దూరంలో ఉన్న జిల్లా కోర్టుకు వెళ్లవలసిన అవసరం తప్పుతుందన్నారు. మాజీ మంత్రి వేణు న్యాయవాదులకు అల్పాహార విందును ఏర్పాటు చేసి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో నాయకులు పట్టుదలతో పనిచేయాలన్నారు. ప్రజలు ఏదైతే కోరుకుంటున్నారో దానిని తీర్చడమే నాయకుల పని అని చిరస్థాయిగా నిలిచిపోయే ఇటువంటి సమస్యల పరిష్కారం చేయడంతో ఆత్మ సంతృప్తితో పాటుగా ప్రజల ఆకాంక్షలు కూడా నెరవేరుతాయన్నారు. జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటు కావడానికి న్యాయవాదుల కృషి కూడా ఎంతో ఉందన్నారు. పలివెల సత్యనారాయణ, దొమ్మలపాటి సత్యనారాయణ, పలివెల వెంకటరమణ, జయశంకర్, తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామికవేత్త తయారవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: స్వర్ణాంధ్ర విజన్-2047 లో భాగంగా ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను స్థానికీకరణ చేయడం అనే అంశంపై మండలంలోని సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఆధారిత నైపుణ్య కల్పనకు భరోసా ఇవ్వనుందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా డిసెంబరు 22న రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో ఉదయం 9 గంటలకు సుమారు 1054 చిన్న పరిశ్రమలకు సంబంధించిన రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరిశ్రమల స్థాపనకు అన్ని రకాల అనుమతులు, బ్యాంకు లోన్లు మంజూరు చేయించడానికి ప్రత్యేకంగా అనుభవజ్ఞులైన పది బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఔత్సాహికులు డిసెంబరు 22న అవగాహన సదస్సులో పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రానున్న 5 సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు, ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, అనిశెట్టి రామకృష్ణ, వీరబోయిన సూరిబాబు, యల్లమిల్లి సతీష్‌కుమారి, నక్కిన దొరబాబు, అయ్యల అమ్మాజీ, నేదునూరి సంతోషమ్మ, రాయుడు సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్రపై బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు

- ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు
- మండపేటలో ఆటో డ్రైవర్ల సమావేశం


ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న వాసంశెట్టి సత్తిరాజు

మండపేట: ఆటో యూనియన్లు అన్నీ ఒకే తాటిమీద నిలబడి తమ హక్కులను కాపాడుకోవాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు అన్నారు. ఆటో డ్రైవర్ల సమావేశం మంగళవారం స్థానిక ఏడిద రోడ్డు బస్టాండ్ ఆవరణలో ఆ యూనియన్ రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు పెనుముచ్చి బాబు సుకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సత్తిరాజు మాట్లాడుతూ ఆటో కార్మికులకు వాహనమిత్ర సదుపాయం కల్పిస్తామంటూ ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అయితే వాహనమిత్ర విషయాన్ని ఇప్పటి వరకూ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దృష్టికి తీసుకుని వెళ్లి ప్రభుత్వానికి తెలిసేలా పోరాటం చేయాలని సూచించారు. ఎన్నికల్లో ఆటో వాలాలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఆటో కార్మికులకు 3 సెంట్ల స్థలం ఇస్తామని కూటమి నాయకులు మాట ఇచ్చారని దాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కార్మిక శాఖ మంత్రితో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఈఎస్ఐ హాస్పిటల్ వచ్చేలా పోరాడాలని కోరారు. కామిరెడ్డి చంద్రరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, బొమ్మ ఫణీంద్ర, ఆటో నాయకులు సన్నాల వెంకన్న, సన్నాల ధనరాజు, మోరంపూడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల అనుభవాలు మార్గదర్శకం కావాలి


పెన్షనర్ల హోం ఆవరణలో జెండాలకు గౌరవ వందనం సమర్పిస్తున్న సంఘ సభ్యులు

కాజులూరు: ఉద్యోగ విరమణ చెందిన విశ్రాంత ఉద్యోగుల (పెన్షనర్ల) అనుభవాలు నేటి తరం ఉద్యోగులకు మార్గదర్శకాలని కాజులూరు, కరప మండలాల పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు దేవు సదానంద మూర్తి అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా గొల్లపాలెంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం సభ్యులు జాతీయ జెండాను, పెన్షనర్స్ సంఘం జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సభలో సదానంద మూర్తి మట్లాడుతూ ఉద్యోగాల నుంచి విరమణ చెంది శేషజీవితం గడుపుతున్న పెన్షనర్ల తమ సమయాన్ని వృథా చేయకుండా పది మందికి సేవ చేయాలని, అనుభవాలు నేటి తరం ఉద్యోగులకు అందించాలనే ఉద్దేశంతో సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. నకారే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంఘ పురోగతికి ఆయన చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కేవీవీ సత్యనారాయణ, పెట్టా సత్తిరాజు, గుబ్బల రామస్వామి, సుంకర వీరభద్రరావు, వడ్లపాటి అప్పారావు, అమలాపురపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


పామర్రు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు


కె.గంగవరం: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. మండలంలోని పామర్రు పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా వచ్చినట్లు తెలిపారు. ప్రజలు చాలా సులభంగా సైబర్ నేరాల బారిన పడి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోనూ సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సైబర్ నేరాల బారిన పడితే సొమ్ము రికవరీకి, నేరస్తులను పట్టుకోవడానికి సమయం పడుతుందని అలా కాకుండా సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు మరింత మెరుగ్గా అవగాహన కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. దీని వలన ప్రజలు ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారని అన్నారు.

అదేవిధంగా సమాజంలో మహిళలు, బాలికల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనితో నేరగాళ్లను త్వరితగతిన పట్టుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, కె.గంగవరం ఎస్సై జానీబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగలు, ఉప కులాలు రేపు కాకినాడ తరలి రావాలి

మండపేట: ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఈ నెల 19న కాకినాడ వస్తున్నందున మాదిగలు, ఉప కులాల వారందరూ ఆ నగరానికి తరలి రావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూలి జయరాజు కోరారు. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు రాజీవ్ రంజన్ మిశ్రా వినతులు స్వీకరిస్తారని చెప్పారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయం వద్ద జయరాజు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. మాదిగ, మాదిగ ఉపకులాల వారి చిరకాల కోరికైన ఎస్సీ వర్గీకరణ నెరవేరే సమయం ఆసన్నమైందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేసే చర్యల్లో భాగంగా సీఎం చంద్రబాబు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రాను ఏకసభ్య కమిషన్‌గా ఏర్పాటు చేశారన్నారు. అందుచేత రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతులు ఇచ్చేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి మాదిగలు, మాదిగ ఉపకులాలు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున కాకినాడ తరలిరావాలని కోరారు.

కూళ్ల డీసీ అధ్యక్షుడిగా తాతపూడి


కపిలేశ్వరపురంలో ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకుంటున్న అధ్యక్షుడు శివప్రసాద్

కపిలేశ్వరపురం: మండలంలోని వ్యవసాయ ఆయకట్టు పరిధిలోని వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా నిర్వహించారు. కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఎన్నికలు జరిగాయి. కూళ్ల వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా తాతపూడికి చెందిన మేకా శివప్రసాద్, ఉపాధ్యక్షుడుగా కె.గంగవరం మండలం అముజూరుకు చెందిన యెనుమల గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. ఎన్నిక ధ్రువపత్రాన్ని తహసీల్దార్ చిన్నారావు తదితర అధికారులు చేతులు మీదుగా అందజేశారు.

మండపేట డీసీ అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి

మండపేట: మండపేట డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా కుతుకులూరు సాగునీటి అధ్యక్షుడు పడాల వెంకట సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో మండపేట, ఏడిద, మురమండ, కుతుకులూరు, రామవరం, పాలమూరు నీటి సంఘాల అధ్యక్షులు సుబ్బారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పసల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ కె. లక్ష్మీశివ జ్యోతి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ధవళేశ్వరం నీటి పారుదల శాఖ డీఈ కె. శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ అజీజ్, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కాజులూరుకు మూడు డీసీలు

కాజులూరు: సాగునీటి సంఘాల ఎన్నికల్లో కాజులూరు మండలానికి పెద్దపీట దక్కింది. సర్వసాధారణంగా మండలానికి ఒక డీసీ పదవి ఉంటుంది. కాలువల పరిధి బట్టి ప్రాదేశిక నియోజకవర్గాల ఎంపిక కావడంతో అక్కడక్కడా కొన్ని మండలాల్లో రెండు డీసీలు ఉండే అవకాశం ఉంది. అయితే మంగళవారం జరిగిన డీసీ ఎన్నికల్లో కాజులూరు మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ పదవులు దక్కాయి. మండలంలో ఎనిమిది నీటి సంఘాలు ఉండగా ఈ నెల 14న అధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఇందులో కోలంక, పల్లిపాలెం సంఘాలు కె.గంగవరం మండలం కోటిపల్లి డిస్ట్రిబ్యూషన్ పరిధిలో ఉండగా పెనుమళ్ళ కరప మండలంలోని సిరిపురం డిస్ట్రిబ్యూషన్ పరిధిలో ఉంది. మిగిలిన ఐదు సంఘాలు, తాళ్లరేవు మండలం పటవల, కోరంగి సంఘాలతో కలిపి కాజులూరు డిస్ట్రిబ్యూషన్ ఉంది. కాజులూరు డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్‌గా దుగ్గుదుర్రు నీటి సంఘం అధ్యక్షుడు లకాని కృష్ణచైతన్య ఎన్నిక కాగా అధికార పార్టీ నాయకుల కృషితో కోలంక నీటి సంఘం అధ్యక్షుడు దాట్ల విజయగోపాలరాజు కోటిపల్లి డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్‌గానూ, పెనుమళ్ళ నీటి సంఘం అధ్యక్షుడు పేపకాయల నారాయణరావు సిరిపురం డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తదితరులు నూతనంగా ఎంపికైన డీసీలను అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించేందుకు, నూతన ఆధార్ నమోదుకు ప్రత్యేక నవీకరణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి తెలిపారు. సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల తల్లిదండ్రులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం కోరుమిల్లి, వడ్లమూరు సచివాలయాల్లోనూ, 19న కేదారిలంక, నేలటూరు, 20న అద్దంకివారిలంక, వెదురుమూడి, 26న కపిలేశ్వరపురం 2, అంగర 1, నల్లూరు, 27న పడమర ఖండ్రిక, అంగర 2, వాకతిప్ప, 28న తాతపూడి, కోరుమిల్లి 2, మాచర గ్రామ సచివాలయాల్లో నవీకరణ శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్రలు ఆధార్ వివరాలను నవీకరణ చేస్తారని ఎంపీడీఓ రత్నకుమారి వివరించారు.

ప్రణాళికాబద్ధంగా ఉపాధి పనులు

కపిలేశ్వరపురం: ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఉపాధి హామీ పథకం అధికారులను ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి ఆదేశించారు. టేకి, నేలటూరు, కేదారిలంక గ్రామాల్లో మంగళవారం ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. ఈనెల 21న కపిలేశ్వరపురంలో మండల స్థాయి సామాజిక తనిఖీ వేదికను నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామసభలను నిర్వహిస్తున్నారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు కుక్కల నాగమణి, కుక్కల వీరన్న, వీధి వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులు గురించి చర్చించారు. డీఆర్‌పీ కృష్ణమూర్తి సామాజిక తనిఖీలోని ప్రధాన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, టెక్నికల్ అసిస్టెంట్ జె.లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.